క్లుప్తంగా

నేడు లక్ష్మీనృసింహుడికి పుష్పాభిషేకం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని ఈటమాపురం గ్రామం పెంచలకొండపై వెలసివున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద సోమవారం సాయంత్రం పుష్పాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ తిరుపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్దగుండాల్ రెడ్డి, ఆలయ అభివృద్ధి చైర్మన్ మన్నూరు శంకర్ రెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు పుష్పాభిషేకం సంబంధించిన వివరాలను మీడియాకు తెలియజేశారు. తిరుపతికి చెందిన బాలాజీ స్వామి ఆధ్వర్యంలో బెంగుళూరు నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన వివిధ రకాల పుష్పాలతో పుష్పాభిషేకం జరుపుతామన్నారు. సోమవారం సాయంత్రం 7 గంటలకు ఈ పుష్పాభిషేకం ప్రారంభం అవుతుందన్నారు. అంతకుముందు ఆలయం వద్ద వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. తూర్పుపల్లి గ్రామస్తులు పుష్పాభిషేకంలో పాల్గొనే భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలియజేశారు.

ఆంజనేయస్వామికి పూజలు


అలంకారంలో అభయాంజనేయస్వామి

పుల్లంపేట : మండలంలోని కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి ఆదివారం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు తమ మొక్కులు తీర్చుకున్నారు.

రోగులకు పండ్లు పంపిణీ


కేక్ కట్ చేస్తున్న ఆర్ఆర్ యూత్ నాయకులు

లక్కిరెడ్డిపల్లె : మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి 59వ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఆయన స్వగృహంలో ఆర్ఆర్ యూత్ నాయకులు జీవన్ రెడ్డి, ఆరిఫ్, రైడర్ నిజాం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ గౌస్ పీర్, వంశీ, కార్తీక్, సుహేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఆకేపాటితో గాలివీటి భేటి


ఆకేపాటితో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి

వీరబల్లె : రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డిని ఆదివారం వీరబల్లి మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎన్నికలు జరిగిన తీరుపై చర్చించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని తెలిపారు. రాష్ట్రంలో మరోసారి వైఎస్ జగన్ సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారని పేర్కొన్నారు. మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను ఆకేపాటి అమరనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థిని కలిసిన వారిలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు రెడ్డి, ఎర్రగడ్డల సుబ్బరామరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె : కార్మిక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేంద్రంలో, రాష్ట్రంలో ఏర్పడే నూతన ప్రభుత్వాలు చొరవ చూపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ టీవీ.రెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ మదనపల్లె నియోజకవర్గ, పట్టణస్థాయి, బాధ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ...కార్మికవర్గ సమస్యలు పరిష్కారం చేయడంలో ఇచ్చిన హామీలు అమలుజరపడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. కార్మిక హక్కులు, చట్టాలు హరించుకుపోతున్నాయన్నారు. ప్రజాప్రతినిధుల వేతనాలు అమాంతంగా పెంచుతున్న ప్రభుత్వాలు, అనునిత్యం దేశంలో సంపద సృష్టిస్తున్న కార్మికవర్గానికి కనీస వేతనాలు అమలుచేయకుండా శ్రమదోపిడీకి ప్రభుత్వాలు పాల్పడుతున్నాయన్నారు. అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పాటైన తక్షణమే అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవార్ల జాతరలు


భక్తులను ఆకట్టుకున్న చాందినీబండి


బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల కొత్తపురమ్మ, నారాయణరెడ్డిపల్లె శ్రీ మంచాలమ్మ, అన్నప్పగారిపల్లె పోలేరమ్మ జాతరలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవార్ల మూలవిరాట్‌లకు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. చాందినీ బండ్లు, కోలాటాలతోపాటు వివిధ సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు చిన్నక్క, పెద్దక్క అమ్మవార్ల జాతర

సుండుపల్లె : మండల కేంద్రంలోని మడితాడు గ్రామ పంచాయతీలో వెలసిన చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మ తల్లుల జాతరను పార్టీలకు, కులమతాలకు అతీతంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం ఉదయాన్నే పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అమ్మవార్లను అందంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం అభిషేకాలు, బోనాలు, రాత్రికి విద్యుత్ దీపాలంకరణతో, మేళతాళాలతో, చెక్కభజనలతో, చాందినీబండ్ల నడుమ జాతర జరుపుతున్నట్లు వారు తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.


ఆలయంలో కొలువైన అమ్మవార్ల మూలవిరాట్

గంగమ్మకు ప్రత్యేక పూజలు

లక్కిరెడ్డిపల్లె : భక్తులు వేలాదిగా తరలి రావడంతో ఆదివారం అనంతపురం గంగమ్మ ఆలయ ప్రాంగణం జాతరను తలపించింది. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. ఆలయ పూజారులు తెల్లవారుజామున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథబాబు, ఎస్ఐ విష్ణువర్ధన్‌లు తమ సిబ్బందితో కలిసి ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చొరవ చూపారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ప్రత్యేక అధికారి మారుతీప్రసాద్, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సమరసింహారెడ్డి, ఉప సర్పంచ్ రాజబాబులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. పూజారులు రవి, గంగాధర్ , శ్రీనివాసులు, మునీంద్రలు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పింపజేసి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో అనంతపురం గంగమ్మ

యల్లమ్మకు బోనాల సమర్పణ


ఊరేగింపుగా బోనాలు తీసుకువస్తున్న మహిళలు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన జగజ్జనని శ్రీ రేణుకా యల్లమాంబ తిరునాల మహోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై బోనాలను సమర్పించారు.

ఈ సందర్భంగా మాచుపల్లె గ్రామంలోని మహిళలు బోనాలను పట్టుకొని అమ్మవారి గుడికి ఊరేగింపుగా చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించి, కాయా కర్పూరాలతో మొక్కుబడులు చెల్లించుకున్నారు. మరి కొందరు కోడిపుంజులు, జంతు బలులు ఇచ్చి అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు కడపకు చెందిన జరుగు రాజశేఖర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

కంబాలకుంటలో వైభవంగా గంగమ్మ జాతర


పెనగలూరు: ప్రత్యేక పూజలందుకున్న గంగమ్మ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని కంబాలకుంట గ్రామంలో కొలువైన గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం గంగమ్మకు భక్తులు పొంగుబాళ్లు పొంగించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ జాతరకు రాజకీయ ప్రముఖులు హాజరు కావడంతో కంబాలకుంట గ్రామం నాయకులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది. ప్రతి ఇంటివద్ద బంధు, మిత్రులకు భోజనాల కార్యక్రమం ఏర్పాటు చేయడంతో సందడి వాతావరణం కనిపించింది.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం


దిగువసిద్దవరంలో గ్రామోత్సవ దృశ్యం


ఆకట్టుకున్న భజన

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని దిగువ సిద్దవరం గ్రామంలో ఆదివారం ఉదయం శ్రీ సీతారాముల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శనివారం సాయంత్రం స్థానిక సర్పంచ్ ప్రేమలత దంపతులు కల్యాణం నిర్వహించగా కురపాటి వెంకటరామయ్య నాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మల్లికార్జున మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న భజన : దిగువ సిద్దవరం గ్రామంలో శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా దొగ్గలపాటి పెంచలయ్య భజన గురువు ఆధ్వర్యంలో తిరుమలరాజుపేట భజన బృందం చేసిన పండ్ర భజన ప్రత్యేకంగా ఆకట్టుకుంది.

ఆసక్తికరంగా నందలూరు ప్రీమియర్ లీగ్

నందలూరు : నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్‌లో భాగంగా నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటులో ఆదివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో గుండ్లూరు జట్టుపై అరవపల్లెకు చెందిన రైజింగ్ స్టార్ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన గుండ్లూరు జట్టు 13.4 ఓవర్లలో 69 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం విజయం కోసం బరిలోకి దిగిన రైజింగ్ స్టార్ జట్టు కేవలం 5.3 ఓవర్లలో 70 పరుగులు చేసి విజయం సాధించింది. అరవపల్లె క్రీడాకారుడు జాఫర్ అలీఖాన్ 45 పరుగులు చేయగా, బౌలర్ చంద్ర 5 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని చాపల మధు చేతులమీదుగా అందుకున్నారు.

వెంకటరాజంపేట జట్టుపై మంటపంపల్లె జట్టు విజయ దుందుభి

మధ్యాహ్నం వెంకటరాజంపేట గోపి లెవన్స్, మంటపంపల్లె ముద్దు కృష్ణారెడ్డి జట్ల మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన వెంకటరాజంపేట జట్టు 13.5 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం 90 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన ముద్దు కృష్ణారెడ్డి జట్టు 9 ఓవర్లలో 93 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు తీయడంతోపాటు 28 పరుగులు చేసిన అహ్మద్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని ఏఎస్ఐ శంకర్ నాయక్ అందజేశారు. మధ్యాహ్నం జరిగిన పోటీలో రెండు టీమ్‌ల నుంచి హైదరాబాదు, కర్ణాటకతోపాటు ఇతర ప్రాంతాల క్రీడాకారులు పాల్గొనడంతో మైదానం మొత్తం క్రీడాకారులతో నిండిపోయింది. ఈ మ్యాచ్‌కు జాతీయ దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుడు శివకోటి, సీనియర్ క్రికెటర్ మున్నాలు అంపైర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడి శెట్టి సుధాకర్, రంజిత్, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


అహ్మద్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందిస్తున్న ఏఎస్ఐ శంకర్ నాయక్

హార్సిలీహిల్స్‌కు బుల్లెట్ రైడింగ్

బి.కొత్తకోట: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌కు బుల్లెట్లపై వచ్చిన పర్యాటక బృందం ఆదివారం సందడి చేసింది. బెంగళూరు ఇందిరానగర్ నుంచి 20 మంది యువకులు ఒకే కంపెనీకి ఒకే రకమైన 20 బుల్లెట్లపై ఒకదాని వెంట ఒకటిగా వరుసగా బయలుదేరి తాడిగోళ్లక్రాస్ మీదుగా హార్సిలీహిల్స్ వెళ్లారు. కొండపై చక్కర్లు కొట్టిన బైక్ రైడర్ల సందడిని పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. తర్వాత మధ్యాహ్నం హార్సిలీహిల్స్ నుంచి వెనుదిరిగి బెంగళూరు వెళ్లారు.

విద్యుత్ కోతలతో అన్నదాతల ఇక్కట్లు

పెద్దతిప్పసముద్రం: విద్యుత్ కోతల కారణంగా తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని అన్నదాతలు వాపోతున్నారు. ప్రధానంగా మండలంలోని సంపతికోట పంచాయతీలోని పలువురు రైతులు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రూ.లక్షలు వెచ్చించి టమాటా పంటలపై పెట్టుబడిగా ధారపోశామని, త్రీ ఫేస్ విద్యుత్ అస్తవ్యస్తంగా సరఫరా కావడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్రీ ఫేస్ విద్యుత్ వచ్చినా కొద్ది సేపటికే ఫీజులు కాలిపోతున్నాయని, తద్వారా సాగు చేసిన పంటలకు నీళ్లు లేక టమాటా మొక్కలన్నీ ఎండిపోతున్నాయని వాపోయారు. త్రీ ఫేస్ విద్యుత్‌పై డిస్కం అధికారులను ప్రశ్నిస్తే అధిక లోడ్ కారణంగా ఫీజులు ఎగిరిపోతున్నాయని సమాధానం చెప్పడం ఎంత వరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. అదే విధంగా పలు చోట్ల చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రైతుల అవసరాలను గుర్తించి సక్రమంగా విద్యుత్ సరఫరా అయ్యేలా చొరవ చూపి పంటలను కాపాడాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను ఎత్తులో ఉండేలా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా మారిన శ్మశానం


శ్మశానంలో మద్యం బాటిళ్లను గుట్టగా వేసిన దృశ్యం

రాజంపేట టౌన్ : మందుబాబులు మద్యం సేవించేందుకు చివరికి శ్మశానాలను కూడా వదలడం లేదు. అందుకు ఉదాహరణగా పట్టణంలోని వత్తలూరు రోడ్డులో ఉన్న శ్మశాన వాటికను చెప్పుకోవచ్చు. ఈ శ్మశాన వాటిక రోడ్డుకు పక్కనే ఉండటంతోపాటు శ్మశానంలో కొంతమేర స్థలం విశాలంగా ఉండటంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మందుబాబులు రాత్రి వేళల్లో మందు సేవించి బాటిళ్లను అక్కడే వేసి వెళుతున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యువకులు బీరు సేవించి బాటిళ్లను అక్కడే వేసి వెళుతున్నట్లు ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ఎవరైనా మృతి చెందినప్పుడు దహనక్రియలు చేపట్టాలంటే ముందు వెళ్లి అక్కడ ఉన్న బాటిళ్లను తొలగించుకొని ఆ తరువాత అంత్యక్రియలను చేపట్టాల్సి వస్తుందని వారు అంటున్నారు. కొన్ని బాటిళ్లను పగులకొట్టి అక్కడే వేస్తుండటంతో అంత్యక్రియలు చేపట్టే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటికకు గేటు లేకపోవడం వల్ల మందుబాబులకు శ్మశానం అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో పోలీసులు శ్మశానం వైపు గస్తీ చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

గొడవలు.. అల్లర్ల జోలికి వెళ్లొద్దు


ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్ : గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లొద్దు.. వెళ్లి మీ జీవితాలు నాశనం చేసుకోవద్దని అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం రాత్రి పట్టణంలో జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ బలగాలతో కలసి ఫ్లాగ్ మార్చ్ (కవాతు) నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ఎస్ఎన్ కాలనీ నుంచి బంగ్లా సర్కిల్లోని నేతాజీ సర్కిల్ వరకు అక్కడ నుంచి ఠాణా, గాంధీ బజార్, ఆర్టీసీ బస్టాండ్ వరకు అక్కడ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు అక్కడ నుంచి అర్బన్ పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎన్నికల వేళ ప్రజలు ఎలాంటి గొడవలకు వెళ్లకూడదని సూచించారు. గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లితే మీ జీవితాలు, కాపురాలు నాశనం అవతాయని తెలియజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే ఆయా ప్రాంతాలలోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరైనా పొరపాటుగా అయినా అల్లర్లు, గొడవల జోలికి వెళ్లినట్లు గుర్తిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తద్వారా వారి జీవితాలు నాశనమవుతాయన్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు ప్రశాంత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫ్లాగ్ మార్చ్‌లు ఎస్ఐ భక్తవత్సలం, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు స్థానిక ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి మల్లయ్యకొండకు రెండు బస్సు సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండను సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

దాతల సహకారం మరువలేనిది


సేవా కార్యక్రమాలపై సమీక్ష జరుపుతున్న మానవత సభ్యులు

రాయచోటి టౌన్ : మానవత సంస్థ సేవలను విస్తృతపరచడానికి దాతలు అందించిన సహకారం మరువలేనిదని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమావేశం సెక్రటరీ వెంకటరమణ, ఉపాధ్యక్షులు సంచుల ఖాదర్ బాషాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ పరిధిలో విద్యార్థులను, రైతులను, ప్రతిభావంతులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలతోపాటు అంబులెన్స్, వైకుంఠ యాత్ర వాహనం వంటి అనేక రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి దాతలు అందిస్తోందన్న సహకారం ఎంతో విలువైందన్నారు. అలాగే విద్యార్థులలో నైతిక విలువలు నేర్పడంతోపాటు ప్రకృతిని కాపాడే ప్రయత్నంలో భాగంగా మొక్కలు పెంచడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కో చైర్మన్ షకీల్, ఆర్‌వీ రాజు, మాజీ అధ్యక్షులు గండ్లపల్లె వెంకటేష్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీ పీజీ సెట్– 2కే24 ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్: కందుల విద్యాసంస్థల్లో ఇటీవల ఎంబీఏ అడ్మిషన్ల కోసం నిర్వహించిన కేజీ పీజీ సెట్ – 2కే24 ఫలితాలను కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్రఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కేజీ పీజీ సెట్‌ను తమ విద్యా సంస్థల్లో నిర్వహించడం ఇది రెండవసారి అని తెలిపారు. ఈ పరీక్షల్లో 169 మంది విద్యార్థులు హాజరుకాగా ఇందులో 159 మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. వీరిలో మొదటి ర్యాంకు సాధించిన వారికి తమ కళాశాలలో ఉచిత విద్యతోపాటు వసతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, వైఎస్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌ప్రసాద్, కేఎస్ఎం ప్రిన్సిపాల్ నాగమణి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లి అయిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల సందడి మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు.

1 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

మదనపల్లె సిటీ: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జూలై 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి తెలిపారు. అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లును ఏఐ కోఆర్డినేటర్ల వద్ద తీసుకోవచ్చునన్నారు. దీంతోపాటు విద్యార్థులు ఏపీఓపెన్‌స్కూల్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముందన్నారు. పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భాష మీద సాధికారతకు పద్యపఠనం అవసరం

మదనపల్లె సిటీ: భాష మీద సాధికారతకు పద్యపఠనం ఎంతో అవసరమని ప్రఖ్యాత రచయిత కోనేటి సుజ్ఞానంద వెంకట నరసింహులు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో ప్రఖ్యాత పద్యకవి, కథ నవలా రచయిత ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ కోడూరు ప్రభాకర్‌రెడ్డి రచించిన ×అనునాదాలు₹ ను విశ్రాంత బ్యాంకు మేనేజర్ వై.శ్రీనివాసులురెడ్డి గ్రంథావిష్కరణ చేసి గ్రంథకర్త ఔన్నత్యాన్ని కొనియాడారు. ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఏ. క్రిష్ణమూర్తి మాట్లాడుతూ పద్యం మీద పట్టు సాధించాలంటే పూర్వజన్మ సుకృతం కొద్దో గొప్పో ఉండి తీరాలని తెలిపారు. ఒకప్పుడు పద్య రచయితలు ఎక్కువగానూ, వచన రచయితలు ఎక్కువగాను ఉండేవారన్నారు. వచన రచయితలు ప్రస్తుతం లెక్కకు మించిపోయి పద్య రచయితలు తక్కువగా కనిపిస్తుండటానికి అదే కారణమన్నారు. యువత పద్య రచనల మీద దృష్టి సారించాలన్నారు. ప్రసిద్ధ హిందీ, సంస్కృత, ఆంగ్ల కవుల పద్యాలను తెలుగులోకి అనువదించి 300 పుటల గ్రంథాన్ని అనువదించిన ప్రభాకర్‌రెడ్డి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రజా చైతన్యస్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు, కామకోటి ప్రసాదరావు, ప్రఖ్యాత నేత్ర వైద్యులు డాక్టర్ సిద్దారెడ్డి, సుమతిరెడ్డి, జహంగీర్‌బాషా, రచయితలు అంజలి, మోహన్‌గుప్తా, కవితశ్రీ, నాగభూషణరావు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (రిమ్స్) ఐపీ విభాగంలో బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.1466వ వరల్డ్ వైడ్ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ నేతృత్వంలో సంఘ సభ్యులు, 40 మంది యువతీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి మెడికల్ సూపరింటెండెంట్ డా. జీవీ రమాదేవి, ఆర్ఎంఓ డా. వై.శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. ఆసుపత్రి సిబ్బంది మాధురి లత, శ్రీకాంత్, వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆర్గనైజర్ జి.ఎబినేజర్ పాల్గొన్నారు.